తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం-25-మార్చి-2026 | సంపుటి : 3 | సంచిక : 296 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# ఈవీ పాలసీతో కాలుష్య నియంత్రణ

**హైదరాబాద్‌ను కాపాడే దిశగా చర్యలు**

**జీరో రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు**

**ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం భారీగా పెరుగుదల**

**చార్జింగ్ స్టేషన్లు, ఉద్యోగులకు ప్రోత్సాహకాలు**

**మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):

**రాష్ట్రంలో కాలుష్యాన్ని తగ్గించి హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈవీ పాలసీని అమలు చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకొచ్చిన ఈ విధానం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈవీ పాలసీ కింద ఎలక్ట్రిక్ వాహనాలకు జీరో రోడ్ టాక్స్, జీరో రిజిస్ట్రేషన్ టాక్స్ మినహాయింపులు కల్పించినట్లు తెలిపారు.**

దీనివల్ల ప్రభుత్వానికి దాదాపు వెయ్యి కోట్ల ఆదాయ నష్టం వచ్చినప్పటికీ, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈ విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. పాలసీ అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం గణనీయంగా పెరిగిందని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించేలా ప్రోత్సాహం కల్పించాలని తయారీ సంస్థలను కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ విభాగాలు, సంస్థలు వాహనాలు కొనుగోలు చేసే సమయంలో ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసి, వాహన వినియోగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.

ప్రముఖ కంపెనీలు కూడా ముందుకు వచ్చి ప్రభుత్వ ఉద్యోగులకు 10 నుంచి 20 శాతం వరకు డిస్కౌంట్లు అందిస్తున్నాయని తెలిపారు.

మిగతా 2లో..

# జీవో 76తో రైతులకు ఊరట

**సాధాబైనామ సమస్యకు సరళ పరిష్కారం**

**అఫిడవిట్ నిబంధనలో సడలింపు.. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి దారి**

**భూ భారతి చట్టంలో కీలక మార్పులు**

హైదరాబాద్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):



రాష్ట్రంలో సాధాబైనామ ద్వారా భూములు కొనుగోలు చేసిన రైతులకు ప్రభుత్వం కీలక ఉపశమనం కల్పించింది. జీవో నెం.76 ద్వారా ఈ సమస్యకు సులభతర పరిష్కారం తీసుకువచ్చినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న కఠిన నిబంధనల వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, తాజా నిర్ణయం వారికి పెద్ద ఊరటగా మారనుంది. ఇప్పటి వరకు సాధాబైనామ భూముల రిజిస్ట్రేషన్ లేదా హక్కుల పరిరక్షణలో కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాల్సి వచ్చేది. కానీ అనేక సందర్భాల్లో అమ్మకందారులను గుర్తించడం, సంప్రదించడం కష్టంగా మారడంతో దరఖాస్తులు నిలిచిపోయాయి. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం, ఇకపై కొనుగోలుదారు ఒక్కరే సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చినా సరిపోతుందని నిర్ణయించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాధాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించినప్పటికీ, 2020 ఆర్.ఓ.ఆర్ చట్టంలో సరైన పరిష్కార మార్గం చూపలేకపోయింది. దీంతో సుమారు 9 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం భూ భారతి చట్టంలో మార్పులు చేసి, శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమం చేసింది. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, అఫిడవిట్ నిబంధనలో సడలింపు తీసుకురావడం ద్వారా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వీలైనంత త్వరగా అన్ని దరఖాస్తులను పరిశీలించి, రైతులకు న్యాయం చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.



# విదేశీ విద్యార్థుల సమస్యలపై అసెంబ్లీలో కేటీఆర్ ప్రస్తావన

- నిధుల విడుదలలో ఆలస్యం పై ఆందోళన
- వేలాది విద్యార్థులు ఎదురుచూపుల్లో
- కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):

విదేశీ విద్యా పథకం కింద విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసెంబ్లీలో లేవనెత్తారు. ప్రభుత్వం ప్రకటించిన నిధులు ఇప్పటివరకు విడుదల కాకపోవడం వల్ల వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించాలని ప్రభుత్వాన్ని కోరారు.

మిగతా 2లో..



# మంత్రి పదవిపై వ్యాఖ్యలు

- ఉద్యమకారులే కాంగ్రెస్ బలం అని రాజగోపాల్ రెడ్డి
- మంత్రి పదవిపై ఆశలపై స్పష్టీకరణ
- కేటీఆర్‌తో సాధారణ చర్చలే అన్న ఎమ్మెల్యే
- సీఎంతో విభేదాల్లేవని క్లారిటీ

2లో

# వదంతులతో పెట్రోల్ కృత్రిమ కొరత




**'నో స్టాక్' బోర్డులతో మూసివేసిన బంకులు**

**కొన్ని ప్రాంతాల్లో కిలోమీటర్ల క్యూలు.. కొరత లేదని ప్రభుత్వ స్పష్టం**

2లో

# తెలంగాణకు కేంద్రం అన్యాయం చేస్తోంది

- సీతక్క తీవ్ర విమర్శలు
- పెన్షన్ల పెంపుపై కేంద్రంపై ఆరోపణలు
- రైతులకు రుణమాఫీ లేకపోవడంపై అసంతృప్తి
- రేషన్ కార్డుల జారీపై ప్రశ్నల వర్షం

హైదరాబాద్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):



తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అన్యాయం చేస్తోందని మంత్రి దానసరి సీతక్క తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా సామాజిక భద్రతా పథకాల విషయంలో కేంద్రం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆమె ఆరోపించారు.

మిగతా 2లో..



# రోడ్ల విస్తరణతో రాష్ట్రానికి నూతన దిశ

- అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి కీలక ప్రకటన
- 6092 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి మహత్తర ప్రణాళిక
- రూ.13,006 కోట్లతో 34 ప్యాకేజీలలో టెండర్లు
- పారదర్శక చెల్లింపులు, నాణ్యతపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మౌలిక వసతులను బలోపేతం చేసి, సమగ్ర అభివృద్ధికి బాటలు వేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి అసెంబ్లీలో స్పష్టం చేశారు. హెచ్ఏఎం ఫేజ్-1 కింద భారీ స్థాయిలో రహదారి నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను కలుపుతూ మొత్తం 6,092.37 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ మహత్తర ప్రాజెక్ట్ కోసం రూ.13,006 కోట్ల వ్యయంతో 34 ప్యాకేజీలలో టెండర్లను ఆహ్వానించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం 24 ప్యాకేజీలకు సంబంధించిన టెండర్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందని, మిగిలిన 10 ప్యాకేజీల ప్రక్రియను వచ్చే వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యగానే పనులను వేగంగా ప్రారంభించి, నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టర్లకు చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా 'డైరెక్ట్ డెబిట్ మెకానిజం' అమలు చేస్తున్నామన్నారు. ఈ విధానం ద్వారా చెల్లింపుల్లో పూర్తి పారదర్శకతను పాటిస్తూ, పనుల నాణ్యతను కూడా కాపాడగలమని చెప్పారు. గతంలో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని, ఈసారి నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వదంతులతో పెట్రోల్ కృత్రిమ కొరత



**హైదరాబాద్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ నగరంలో మంగళవారం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనేక పెట్రోల్ బంకులు 'నో స్టాక్' బోర్డులు పెట్టి మూసివేయడంతో, తెరిచి ఉన్న కొన్ని బంకుల వద్ద కిలోమీటర్ల మేర వాహనాల క్యూలు కనిపించాయి. ఒక్కసారిగా పెరిగిన డిమాండ్‌తో నగరంలోని పలు ప్రాంతాల్లో రద్దీ పరిస్థితి నెలకొంది. ఉప్పల్, మల్లాపూర్, ఘట్‌కేసర్, అత్తాపూర్, కాటేదాన్, చంద్రాయణగుట్ట వంటి ప్రాంతాల్లో అనేక పెట్రోల్ పంపులు మూసివేయబడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కొన్నిచోట్ల తెరిచి ఉన్న బంకుల వద్ద కార్లు, ఆటోలు, బైక్‌లతో భారీగా క్యూలు ఏర్పడ్డాయి. నాంపల్లిలో సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ఆటోలు గంటల తరబడి బారులు తీరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితిపై తెలంగాణ పౌరసరఫరాల శాఖ స్పందిస్తూ రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ లేదా వంట గ్యాస్‌కు కొరత లేదని స్పష్టం చేసింది. కొన్ని తప్పుడు వదంతుల కారణంగా ప్రజలు ఆందోళనకు గురై ఒక్కసారిగా ఇంధనం నింపుకోవడానికి బంకులపైకి రావడంతో కృత్రిమ కొరత ఏర్పడిందని వివరించింది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ముందస్తు చెల్లింపుల విధానంలో చేసిన మార్పుల వల్ల కొందరు డీలర్లకు తాత్కాలిక ఇబ్బందులు ఎదురైన మాట నిజమేనని, అయితే సరఫరాపై ప్రభావం లేదని పేర్కొంది. ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేయడం లేదా బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. ప్రజలు వదంతులను నమ్మవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని తెలిపారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ కూడా ప్రజలను అప్రమత్తం చేస్తూ సోషల్ మీడియా వేదికగా సందేశం విడుదల చేశారు. నగరంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే 1967 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# రోడ్ల విస్తరణతో రాష్ట్రానికి నూతన దిశ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర అభివృద్ధికి రహదారులు ముఖ్య ఆధారమని, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు సౌకర్యవంతమైన రవాణా కల్పించడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం అవుతాయని మంత్రి పేర్కొన్నారు. రోడ్ల విస్తరణతో పరిశ్రమలు, వ్యాపారాలు అభివృద్ధి చెందడమే కాకుండా, పెట్టుబడులు కూడా ఆకర్షితమవుతాయని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన రహదారులు అందించడం ద్వారా ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందని అన్నారు.

ఇక ప్రభుత్వ లక్ష్యం కేవలం రోడ్ల నిర్మాణం మాత్రమే కాకుండా, దీర్ఘకాలికంగా ఉపయోగపడే మౌలిక వసతులను సృష్టించడం అని మంత్రి స్పష్టం చేశారు. రాబోయే కాలంలో రాష్ట్రాన్ని రవాణా రంగంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు మరిన్ని సంస్కరణలు చేపడతామని అసెంబ్లీలో వెల్లడించారు. మొత్తంగా ఈ ప్రణాళిక ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కొత్త ఊపు రానుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# ఈవీ పాలసీతో కాలుష్య నియంత్రణ

(మొదటి పేజీ తరువాయి)

నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని, డీజిల్ ఆటోలను కూడా రీట్రోఫిట్ చేసి ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాలను స్క్రాపేజీకి పంపిస్తూ కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇక వాహనాల కొనుగోలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసేందుకు వాహన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. వాహనాన్ని కొనుగోలు చేసిన షోరూమ్‌లోనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరాలంటే ఉద్యోగులే కీలక పాత్ర పోషిస్తారని మంత్రి స్పష్టం చేశారు.

# తెలంగాణకు కేంద్రం అన్యాయం చేస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

వికలాంగులు, విధవలకు గత 10 సంవత్సరాలుగా పెన్షన్ల పెంపు జరగకపోవడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాన్ని పక్కన పెట్టి ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం బాధాకరమని ఆమె వ్యాఖ్యానించారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ, తెలంగాణకు అవసరమైన నిధులను కేంద్రం నుంచి తెచ్చే విషయంలో వారు విఫలమయ్యారని సీతక్క విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఆసక్తి చూపడం లేదని ఆరోపించారు. దీంతో రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఆలస్యమవుతున్నాయని ఆమె అన్నారు.

# తెలంగాణలో ఈవీ విప్లవానికి ఊతం

- ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక రాయితీలు
- గ్రామీణ ప్రాంతాల్లో ఈవీల ప్రోత్సాహం
- పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు



**హైదరాబాద్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచే దిశగా కీలక ముందడుగు పడింది. మహీంద్రా సంస్థ తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక రాయితీలు ప్రకటించగా, దీనికి మంత్రి పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్రంలో స్వచ్ఛమైన రవాణా వ్యవస్థకు బలం చేకూర్చుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న ఈ ప్రత్యేక డిస్కౌంట్ వల్ల ఈవీ వాహనాల కొనుగోలు మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ వాహనాల వినియోగం పెరగడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల విప్లవానికి కేంద్రబిందువుగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దిశగా ప్రభుత్వం వివిధ ప్రోత్సాహక చర్యలు చేపడుతోంది. చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలు అమలు చేస్తూ ఈ రంగాన్ని బలోపేతం చేస్తోంది. మహీంద్రా వంటి సంస్థలు ముందుకు రావడం ఈ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వంతో కలిసి పనిచేసే సంస్థలు పెరిగితే ఈవీ రంగం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మహీంద్రా సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ఈవీ వినియోగం పెరగడానికి ఇలాంటి భాగస్వామ్యం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణ స్వచ్ఛమైన రవాణా రంగంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# విదేశీ విద్యార్థుల సమస్యలపై అసెంబ్లీలో కేటీఆర్ ప్రస్తావన

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 'ఓవర్సీస్ విద్యా నిధి' ద్వారా దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు పెద్దఎత్తున ఆర్థిక సహాయం అందించామని కేటీఆర్ గుర్తుచేశారు. సుమారు 7,000 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున మద్దతు ఇచ్చినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా అనేక మంది విదేశాల్లో గౌరవప్రదంగా చదువుకునే అవకాశం పొందారని పేర్కొన్నారు.

అయితే 2025 అక్టోబర్‌లో రూ.303 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఆ నిధులు అందలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రస్తుతం దాదాపు 2,500 మంది విద్యార్థులు ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. మొదటి సెమిస్టర్ ఫీజులు చెల్లించిన విద్యార్థులు రెండో సెమిస్టర్ ఫీజులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. అమెరికా, లండన్, జర్మనీ వంటి దేశాల్లో ఉన్న తెలంగాణ విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు. తమ పరిస్థితిని వివరించి అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించాలని విద్యార్థులు కోరుతున్నారని తెలిపారు. విద్య మధ్యలో ఆగిపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి 'గ్రీన్ ఛానల్' ద్వారా ప్రక్రియను పూర్తి చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇది కొత్త కోరిక కాదని, ప్రభుత్వం ప్రకటించిన పథకమే అని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# గ్యాస్ సంక్షోభంపై అసెంబ్లీ ముట్టడి...

- కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ నిరసన తీవ్రతరం
- గన్ పార్క్ వద్ద భారీ ఆందోళన
- హోటళ్లు, చిరు వ్యాపారులపై ప్రభావం
- ప్రజలకు నిజాలు చెప్పాలని డిమాండ్

**హైదరాబాద్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరత సమస్యపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్ పార్క్ వద్ద గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, గ్యాస్ సంక్షోభంపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీ వైపు ర్యాలీగా బయలుదేరారు. ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా విషయంలో పారదర్శకత లేకపోవడం వల్ల ప్రజల్లో గందరగోళం నెలకొన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను దాచిపెడుతోందని ఆరోపించారు. కేటీఆర్ మాట్లాడుతూ, ఒకవైపు గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం చెబుతుంటే, మరోవైపు హోటళ్లు, చిరు వ్యాపారులకు సరఫరాను నిలిపివేయడం తీవ్ర అన్యాయం అని అన్నారు. గ్యాస్ అందక హోటల్ వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్ కొరత ప్రభావం సాధారణ ప్రజలపై కూడా పడుతోందని కేటీఆర్ తెలిపారు. గృహ వినియోగదారులు కూడా సిలిండర్లు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ధరలు పెరగడం, సరఫరా ఆలస్యం వంటి సమస్యలు ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్ సరఫరా అంశంపై ప్రజలకు నిజాలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గ్యాస్ అందుబాటును పెంచాలని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్యాస్ సంక్షోభంపై స్పందించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కేటీఆర్ స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాను పెంచేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, వ్యాపారులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.



# మంత్రి పదవిపై వ్యాఖ్యలు



**హైదరాబాద్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాలంటే తనలాంటి ఉద్యమకారుల సేవలు అవసరమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మంత్రి పదవి కోసం తాను పరితపించడం లేదని, అయితే గతంలో పార్టీ అధిష్ఠానం తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిందని వెల్లడించారు. దీనిపై తుది నిర్ణయం ఏమవుతుందో తనకు తెలియదని చెప్పారు. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ఆయన, తనకు మంత్రి పదవి ఇస్తే ప్రభుత్వం, పార్టీకి మంచి పేరు వస్తుందని వ్యాఖ్యానించారు. తాను ఎలాంటి పదవి లేకపోయినా ప్రజల్లో తనకు గౌరవం ఉందని, ప్రజా సేవే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పదవులు కంటే ప్రజల విశ్వాసమే ముఖ్యమని అన్నారు.

ఈరోజు అసెంబ్లీ లాంజ్‌లో కేటీఆర్‌తో మాట్లాడిన విషయంపై కూడా ఆయన స్పందించారు. ఎలాంటి రాజకీయ చర్చలు కాకుండా సాధారణ విషయాలపైనే మాట్లాడినట్లు తెలిపారు. అయితే 2018లో 12 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకోవడం తప్పేనని కేటీఆర్‌కు తన అభిప్రాయం చెప్పినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. నిన్న ప్రత్యేకంగా భేటీ కాలేదని, అసెంబ్లీలో ఎదురుపడితే సాధారణంగా మాట్లాడుకున్నామని తెలిపారు. పార్టీ అంతర్గత విషయాలను చర్చించుకుంటూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఉద్యమకారుల పాత్ర కీలకమని ఆయన మరోసారి పేర్కొన్నారు. భవిష్యత్తులో పార్టీ మరింత బలపడేలా పనిచేస్తామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే దిశగా కృషి చేస్తామని వెల్లడించారు.

# యాదాద్రిలో దారుణం

- సపోటా పండులో విషం పెట్టి చిన్నారిని హత్య చేసిన తండ్రి
- కుటుంబ కలహాలే ఘోరానికి కారణం
- విషపూరిత పండు తినిపించి కూతురిని హతమార్చిన తండ్రి
- పోలీసుల కేసు నమోదు, దర్యాప్తు ప్రారంభం



**యాదాద్రి, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రం యాదాద్రి జిల్లాలో హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది సంస్థాన్‌నారాయణపురం మండలం లచ్చలగూడెం గ్రామంలో ఒక తండ్రి సపోటా పండులో ఎలుకల మందు కలిపి తన చిన్నారిని హతమార్చిన ఘటన తీవ్ర కలకలం రేపింది. మూడు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా బయటపడింది. పోలీసుల వివరాల ప్రకారం, వరికుప్పల రవి అనే వ్యక్తికి మూడు సంవత్సరాల క్రితం స్వాతితో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల మేఘన, తొమ్మిది నెలల మయూరి అనే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో స్వాతి తన చిన్న కూతురితో పుట్టింట్లో ఉండగా, పెద్ద కూతురు మేఘన తండ్రి వద్దే ఉంది. పెద్ద కూతురిని తన వద్దకు పంపాలని స్వాతి పలుమార్లు కోరినా, రవి అంగీకరించలేదు. ఈ వివాదంపై స్వాతి మాద్గులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు రవిని పిలిపించి మాట్లాడారు. ఈ సమస్యను పెద్దల సమక్షంలో పరిష్కరించాల్సి ఉండగా, రవి మాత్రం కడతేర్చే దారుణ నిర్ణయం తీసుకున్నాడు. శనివారం సపోటా పండులో ఎలుకల మందు కలిపి తన కూతురికి తినిపించాడు. విషం ప్రభావంతో చిన్నారి కొద్ది సేపటిలోనే వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లింది. విషయం బయటపడుతుందనే భయంతో రవి కూడా నిద్రమాత్రలు, ఎలుకల మందు తీసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఇద్దరినీ ఆసుపత్రికి తరలించగా, చిన్నారిని నీలోఫర్ ఆసుపత్రిలో చేర్చినా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై తల్లి స్వాతి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ కలహాలు ఎంతటి దారుణాలకు దారి తీస్తాయో ఈ సంఘటన స్పష్టంగా చూపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక



## సీఎంను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్



- ఎంఎంసి భూమిపూజకు ఆహ్వానం... కీలక సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

**హైదరాబాద్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, వచ్చే వారం నిర్వహించనున్న మల్కాజిగిరి మున్సిపల్ కమిషనరేట్ (ఎంఎంసి) భూమిపూజ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, రామంతపూర్ ప్రాంతంలో కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే అభ్యర్థించారు.చర్లపల్లి డివిజన్ పరిధిలో ఇందిరా గృహకాల్ప పథకం కింద నిర్మించిన కాలనీల్లో నీటి లీకేజీలు, డ్రైనేజ్ సమస్యలు, స్లాబ్ పగుళ్లు వంటి సమస్యలు ఉన్నాయని పేర్కొంటూ, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలకు తక్షణ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే కాలనీల చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి రక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు.పటేల్ కుంట, రామంతపూర్ చిన్న చెరువుల అభివృద్ధి చేపట్టాలని కూడా ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.ఈ వినతులపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉప్పల్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం హామీ ఇవ్వగా, ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు పంటలను ప్రభుత్వం కొనాలి: సీపీఎం




- నకిలీ విత్తనాలపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి.

**వేంసూరు, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** రైతులు పండించిన దాళ్వా వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. మంగళవారం వేంసూరు మండల కేంద్రంలోని ఎర్రా రామయ్య భవనంలో మోరంపూడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను అలుసుగా తీసుకుని దళారులు రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. క్వింటాకు సుమారు రూ.350 వరకు తగ్గించి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను దళారుల దగా నుంచి ప్రభుత్వం కాపాడాలని కోరారు. అదేవిధంగా, సిద్ధారం, గౌరీగూడెం, సదాశివునిపాలెం, లింగపాలెం తదితర గ్రామాల్లో నకిలీ వరి విత్తనాలు అమ్మిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విత్తన తయారీ సంస్థలపై పీడీ యాక్ట్ నమోదు చేసి, నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని అన్నారు. లేకపోతే రైతులను రాజకీయాలకు అతీతంగా ఏకం చేసి పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్ రావు, సీనియర్ నాయకులు అర్వపల్లి గోపాలరావు, కొత్తా సత్యనారాయణ, మల్లూరు చంద్రశేఖర్, అర్వపల్లి వెంకటేశ్వరరావు, గడిపర్తి మోహన్ రావు, చీపి రామకృష్ణ, పుచ్చకాయల వెంకటేశ్వరరావు, కావూరి సుదర్శనం, ఐద్వా నాయకురాలు శీలం కరుణ తదితరులు పాల్గొన్నారు.





# డ్రగ్స్ రహిత సమాజం మన అందరి ధ్యేయం

**పోలీస్ కమిషనర్ సునీల్ దాత్**

**ఖమ్మం బ్యూరో, మార్చి 24(తెలంగాణ ముచ్చట్లు):**డ్రగ్స్ రహిత సమాజం మన అందరి ధ్యేయమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు కార్యక్రమం ముదిగొండ మండలం మేడేపల్లి నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతలో అవగాహన పెంచి జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చడానికి ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని యువతకు విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్ కి బానిసలూ కాకుంటే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. మాదకద్రవ్యాల వినియోగం తీవ్రమైన సామజిక, మానసిక, శారీరక సమస్యలకు దారితీస్తాయన్నారు. ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలు, స్నేహితులపై నిఘా ఉంచి వారి కదలికలను గమనిస్తూ ఉండాలన్నారు. విద్యార్థిని విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండి విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం ఆల్కహాల్ వినియోగం ఫ్యాషన్ గా మారిపోయిందని ఇది ఎంత మాత్రం మంచిది కాదన్నారు. ముఖ్యంగా యువత విద్యపై దృష్టి కేంద్రీకరించాలని, డ్రగ్స్ వినియోగం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైనా గంజాయి, గ్రామాల్లో డ్రగ్స్ వినియోగానికి సంబంధించి సమాచారం తెలిస్తే తక్షణమే 1908 లేదా పోలీస్ వారికి తెలియజేస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రతిజ్ఞ చేశారు.

కార్యక్రమంలో రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, సిఐ మురళి, నార్కోటిక్ ఏసీపీ సోమనాధం, ఎస్సై సంతోష్,సామినేని వెంకటేశ్వరరావు గ్రామ పెద్దలు, చెరుకుపల్లి జగన్నాథం సర్పంచ్ మేడిపల్లి, తోట వెంకటేశ్వర్లు సర్పంచ్ కట్టుకూరు, కందుల బాలచందర్ వెంకటాపురం సర్పంచ్, పాల్గొన్నారు.





# చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి పనులకు శ్రీకారం

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- డ్రైనేజ్, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన
- ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబాటు

**కుషాయిగూడ, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):**ఉప్పల్ నియోజకవర్గ కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు ఉత్సాహంగా శ్రీకారం చుట్టారు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. డివిజన్‌లో పలు మౌలిక వసతుల పనులకు ఆయన శంకుస్థాపన పనులు నిర్వహించారు.కుషాయిగూడలోని పోచమ్మ గుడి సమీపంలో స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ పనుల ద్వారా వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు గణనీయంగా తగ్గి, కాలనీవాసులకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు.అనంతరం చక్రిపురం కాలనీలో సీసీ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, రహదారి అభివృద్ధితో రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. అలాగే టీచర్స్ కాలనీలో కూడా సీసీ రోడ్ల పనులను ప్రారంభించి, స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి, చర్లపల్లి డివిజన్ నాయకులు, కాలనీ ప్రతినిధులు, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు.!

- ఈగల్ ఫోర్స్ ఆఫీసర్ జీవన్ రెడ్డి, ఎస్ఐ వీరేంద్ర సూచనలు.

**సత్తుపల్లి, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** మాదకద్రవ్యాల వినియోగంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు సత్తుపల్లి మండలం, బి గంగారం గ్రామం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్ శాఖ, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, యాజమాన్యం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా ఈగల్ ఫోర్స్ తెలంగాణ ఆఫీసర్ జీవన్ రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరమని, వాటి వినియోగం లేదా ప్రోత్సాహం పట్ల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం కారణంగా విద్యార్థులు స్నేహితుల ప్రభావంతో మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ఇది వారి భవిష్యత్తుతో పాటు కుటుంబాలను కూడా దెబ్బతీస్తుందని అన్నారు. సత్తుపల్లి ఎంపీడీఓ మాట్లాడుతూ చిన్ననేరం గానీ, పెద్దనేరం గానీ పోలీస్ రికార్డుల్లో నమోదు అయితే ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ ఉద్యోగ అవకాశాలు కూడా దెబ్బతింటాయని తెలిపారు. ఉద్యోగాల్లో చేరేందుకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ అవసరం అవుతుందని పేర్కొన్నారు. సబ్ ఇన్స్పెక్టర్ వీరేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు తమ పేర్లు పోలీస్ రికార్డుల్లో నమోదు కాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. సోషల్ మీడియాలో బాధ్యతారహితంగా వ్యవహరించినా సైబర్ నేరాల కింద కేసులు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తేనే సమాజంలో గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు. టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి అబ్కారీ సబ్ ఇన్స్పెక్టర్, గంగారం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు, సర్పంచ్ రేవతి, కళాశాల సెక్రటరీ దాసరి ప్రభాకర్ రెడ్డి, విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బలుసుపాటి సీతారాములు, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీసీలకు మోసం... కాంగ్రెస్ బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు



**హుజురాబాద్ టౌన్ మార్చ్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** అధికారంలోకి రాకముందు కామారెడ్డి డిక్లరేషన్ అంటూ బీసీలను నమ్మించి ఓట్లు దోచుకున్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే బీసీలను పూర్తిగా విస్మరిస్తూ మోసం చేస్తోందని బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుడికల భాస్కర్ తీవ్రంగా మండిపడ్డారు.

సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వరుసగా మూడు బడ్జెట్లలోనూ బీసీలకు అన్యాయం చేస్తూనే ఉందని ధ్వజమెత్తారు. “హామీలు ఇచ్చేటప్పుడు పెద్ద పెద్ద మాటలు... కానీ అమలు చేయాల్సిన సమయంలో బీసీలను పూర్తిగా మర్చిపోయారు” అంటూ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.

బీసీల సంక్షేమానికి కనీసం రూ.2 వేల కోట్లు కేటాయించాలని, బీసీ సబ్ ప్లాన్‌ను చట్టబద్ధంగా తీసుకురావాలని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని పదే పదే డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. “ఇది నిర్లక్ష్యం కాదు... ఇది స్పష్టమైన వివక్ష” అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.12,500 కోట్లు మాత్రమే కేటాయించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన అసలు వైఖరిని బయటపెట్టిందన్నారు. రాష్ట్ర జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు కేవలం 3.85 శాతం నిధులు కేటాయించడం దారుణమని విమర్శించారు. “ఇది బడ్జెట్ కాదు... బీసీలపై బహిరంగ అన్యాయం” అని తీవ్రంగా వ్యాఖ్యానించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల అభివృద్ధిపై స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ, “60 శాతం ప్రజలు ఉన్నా 3.85 శాతం నిధులతో ఎలా అభివృద్ధి సాధ్యం?” అని ప్రశ్నించారు.

అలాగే ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. జోడో యాత్రలో జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయిస్తామని చెప్పి, ఇప్పుడు ఆ మాటలను తుంగలో తొక్కిందని విమర్శించారు. బీసీ, ఎంబీసీ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం ప్రభుత్వం బీసీల పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉందో చూపిస్తోందన్నారు. “ఓట్లు వేసే సమయంలో మాత్రమే బీసీలు గుర్తొస్తారా?” అని మండిపడ్డారు.

ఇకపై బీసీలు మోసపోవద్దని, బహుజన సమాజం ఏకమై అగ్రవర్ణ ఆధిపత్య పార్టీలకు గట్టి సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. “బీసీ జెండా – బీసీ ఎజెండా”తో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# క్షయంపై అప్రమత్తతే ఆయుధం: చల్పూర్‌లో అవగాహన ర్యాలీ




**హుజురాబాద్ టౌన్ మార్చ్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా చల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని క్షయ వ్యాధిపై జాగ్రత్తలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చందు మాట్లాడుతూ, రెండు వారాలకు మించి దగ్గు కొనసాగితే అది సాధారణం కాదని, వెంటనే క్షయ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తొందరగా గుర్తిస్తే క్షయాన్ని పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు.


ప్రభుత్వం క్షయ రోగులకు ఉచిత చికిత్స అందించడంతో పాటు, పోషకాహారం కోసం ఆర్థిక సహాయం కూడా అందిస్తున్నదని ఆయన వివరించారు. ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైద్యులు తులసీదాస్, జరీనా, ప్రతాప్ తదితరులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

# ప్రధాని పర్యటనలో రైల్వే అభివృద్ధి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి

- **నూర్ అహ్మద్ అలీ వినతి**
- **రాధాకృష్ణ నగర్ స్టేషన్, మల్కాజిగిరి సదుపాయాల ప్రారంభానికి కోరింపు**

**మల్కాజ్గిరి, మార్చ్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు, లాంగ్ డిస్టెన్స్ & ఎంఎంటిఎస్ ట్రావెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సబర్బన్ ట్రైన్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నూర్ అహ్మద్ అలీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా కీలక రైల్వే అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.హైదరాబాద్ డివిజన్ పరిధిలో ఇప్పటికే సిద్ధంగా ఉన్న రాధాకృష్ణ నగర్ రైల్వే స్టేషన్‌ను ప్రారంభించాలని ఆయన కోరారు. అలాగే అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేసిన మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, విఐపీ లాంజ్, ఆర్‌పీఎఫ్ కార్యాలయం, వేయిటింగ్ హాల్, లిఫ్టులు, ఎస్కలేటర్లు వంటి సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అభ్యర్థించారు.హైదరాబాద్ డివిజన్‌లో పూర్తయిన మరికొన్ని అభివృద్ధి పనులు కూడా ప్రారంభానికి ఎదురుచూస్తున్నాయని, వీటి ఆలస్యం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు.ప్రజలు, ప్రయాణికులు ఈ సదుపాయాల ప్రారంభాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని పేర్కొంటూ, ప్రధాన మంత్రి ఈ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని ప్రాజెక్టులను దేశానికి అంకితం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



# స్ట్రక్చర్ మీటింగ్‌లో ఏరియా సమస్యలపై చర్చ.!

- **సత్తుపల్లిలో జీఎం కార్యాలయంలో సమావేశం.**




**సత్తుపల్లి, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు-):**సత్తుపల్లి సింగరేణి జీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన స్ట్రక్చర్ మీటింగ్‌లో ఏరియా సమస్యలపై విస్తృతంగా చర్చ జరిగింది. గుర్తింపు యూనియన్, ప్రాతినిధ్య యూనియన్ నాయకులు పాల్గొన్న ఈ సమావేశానికి జీఎం చింతల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. వివిధ శాఖల అధికారులతో కలిసి కార్మికులకు సంబంధించిన సమస్యలు, మౌలిక సదుపాయాల అంశాలు, పనుల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించి, వాటిని సానుకూలంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జీఎం హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జీఎం సిహెచ్ శ్రీనివాస్, ఎస్ఓ టు జీఎం బొల్లం శ్రీనివాస్, జేవిఆర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్విఆర్ ప్రహ్లాద్, కిష్టారం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏఎల్ఎస్వీ సునీల్ వర్మ, ఏజీఎం (పర్) జివి మోహన్ రావు, ఏరియా ఇంజనీర్ కె సోమశేఖర రావు, ఏజీఎం (ఎఫ్ & ఏ) బీబత్స, ఏజీఎం (సివిల్) సిహెచ్ రామకృష్ణ, ప్రాజెక్ట్ ఇంజనీర్ జేవిఆర్ సిహెచ్‌పి డి. శ్రీనివాసరావు, డై సీఎంఓ డిస్పెన్సరీ డి. నరసింహారావు, హెచ్ ఓ డీ (ఎన్విరాన్మెంట్) తోట సత్యనారాయణ, ఎస్ఈ (సివిల్) ఎ. రవికుమార్, ఎస్ఈ (ఎంఎస్) కెఆర్ నాగభూషణం పాల్గొన్నారు. అలాగే ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ కార్మిక సంఘాల నాయకులు, వెల్ఫేర్ ఆఫీసర్లు, ఇతర అధికారులు హాజరయ్యారు.

# జమ్మికుంట చైర్మన్‌కు టీజీఎన్‌పీడీసీఎల్ అధికారుల ఘన సత్కారం

**జమ్మికుంట టౌన్ మార్చ్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)ను టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏడి రాజేందర్, ఏఈ శంకరయ్యలు చైర్మన్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.
చైర్మన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం సాదాసీదాగా జరిగినప్పటికీ ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. పరస్పర సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యండి ఆయాజ్, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, అలాగే ఏఎల్ఎం, జేఎల్ఎం సిబ్బంది, రవి, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# క్షయ వ్యాధి నిర్మూలనపై విస్తృత అవగాహన ర్యాలీ

**జమ్మికుంట టౌన్ మార్చ్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణంలో విస్తృత స్థాయిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) వైద్యాధికారి డాక్టర్ వరుణ ఆధ్వర్యంలో జడ్‌పీహెచ్ఎస్ (ZPHS) విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగుతూ ప్రజల్లో క్షయ వ్యాధిపై చైతన్యం కల్పించింది. “టీబీ అంతం మన అందరి పంతం”, “క్షయ వ్యాధి నయం అవుతుంది - భయపడవద్దు”, “లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్ష చేయించుకోండి” వంటి నినాదాలతో విద్యార్థులు ప్రజల దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరుణ మాట్లాడుతూ, క్షయ వ్యాధి ఒక అంటు వ్యాధి అయినప్పటికీ సరైన సమయంలో గుర్తించి, పూర్తి స్థాయిలో చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. ఎక్కువ కాలం దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా టీబీ రోగులకు ఉచిత పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని, చికిత్స మధ్యలో ఆపకుండా పూర్తి కోర్సు పూర్తి చేయడం చాలా ముఖ్యమని వివరించారు. అదేవిధంగా పోషకాహారం, పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చని చెప్పారు. అనంతరం విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి, క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# పూడూరు గ్రామంలో పరిశ్రమల కోసం భూమి పరిశీలన

- **టిఎస్ఐఐసీకి కేటాయింపుపై అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సందర్శన**

**మేడ్చల్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని మేడ్చల్ మండలం పూడూరు గ్రామంలో సర్వే నంబర్ 608లో ఉన్న భూమిని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టిఎస్ఐఐసీ)కు కేటాయించే అంశంపై జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి మంగళవారం స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా భూమి విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలత వంటి అంశాలను అధికారులు సమీక్షించారు. స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను మేడ్చల్ ఎమ్మార్వో అదనపు కలెక్టర్‌కు వివరించారు.పరిశ్రమల అభివృద్ధికి ఈ భూమి కీలకంగా మారే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మార్వో భూపాల్, ఆర్ఐ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# నాచారం రెడ్డి స్మశాన వాటిక అభివృద్ధి పనులు పూర్తికి చేరువ

- **రూ.58 లక్షలతో చేపట్టిన పనుల పర్యవేక్షణ**
- **మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్**

**నాచారం, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ బాబా నగర్‌లోని రెడ్డి సంఘం స్మశాన వాటిక అభివృద్ధి పనులు పూర్తికి చేరువలో ఉన్నాయి. సుమారు రూ.58 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనులు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ రెడ్డి సంఘం సభ్యులతో కలిసి స్మశాన వాటికను సందర్శించి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇంకా ఏమైనా పనులు మిగిలి ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. అవసరమైతే సంబంధిత ఎమ్మెల్యేతో మాట్లాడి మరిన్ని నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఏళ్ల తరబడి అభివృద్ధి లేక నిర్లక్ష్యానికి గురైన ఈ స్మశాన వాటికను తన పదవీకాలంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో అభివృద్ధి చేయగలిగినందుకు సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా రెడ్డి సంఘం నాయకులు స్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపట్టినందుకు మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో పాటు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి, రమణారెడ్డి, మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

- **మున్సిపాలిటీ పూర్తి సహకారం హామీ**
- **చైర్మన్ ప్రశాంత్ కుమార్**

**జమ్మికుంట టౌన్ మార్చ్ 24 (తెలంగాణ ముచ్చట్లు):**అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆలయ కమిటీ మున్సిపల్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా ఆహ్వానించింది. దేవస్థానం చైర్మన్ ఇంగ్లే రామారావు, ధర్మకర్తలు కలిసి జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)నుకలసిబ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను జ్ఞాపికతో అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మున్సిపాలిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. పరిశుభ్రత, త్రాగు నీటి సదుపాయం వంటి అంశాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, రాజకీయాలకు అతీతంగా సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, ఆలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో బిఆర్ఎస్వీ నేత అరెస్ట్



- ఉదయం 5 గంటలకు పోలీసుల చర్య
- కుషాయిగూడకు తరలింపు

**కుషాయిగూడ, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో బిఆర్ఎస్వీ సీనియర్ నాయకుడు తెలకలపల్లి జయకృష్ణను పోలీసులు మంగళవారం తెల్లవారు జామున అరెస్ట్ చేశారు. ఉదయం 5 గంటల సమయంలో ఆయనను అదుపులోకి తీసుకుని కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్వీ నాయకులు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ ముందస్తు అరెస్టులు చేపట్టినట్లు తెలుస్తోంది.ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ, అక్రమ అరెస్టులతో ప్రజా వ్యతిరేకతను అణచివేయలేరని ప్రభుత్వాన్ని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.అరెస్టుల ద్వారా ప్రభుత్వం ఎక్కువ కాలం నిలవలేదని హెచ్చరిస్తూ, విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రకటించిన 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.విద్యార్థి విభాగం తరఫున తమ ఆందోళనలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# అశోక్ నాయక్ తండ్రిని పరామర్శించిన తుంబూరు దయాకర్ రెడ్డి



**ఖమ్మం బ్యూరో, మార్చి 24(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మీర అశోక్ నాయక్ తండ్రిని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల హైదరాబాద్‌లో వెన్నుపూస శస్త్రచికిత్స చేయించుకుని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజ్మీర కిషోర్ నాయక్, కౌన్సిలర్ కడవ నవీన్ కుమార్, ధరావత్ నారాయణ, భూక్యా సర్వర్ సింగ్, పసుపులేటి సత్యం, సప్పిడి రాధాకృష్ణ, పుల్లారావు, వెలుగు సుధాకర్, పోతుల కృష్ణ, బానోత్ శంకర్, బానోత్ సాయి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళల జోలికొస్తే ఊచలు లెక్కపెట్టాల్సిందే!

- నెల రోజుల్లో 181 మంది అరెస్ట్
- డీసీపీ ఉషారాణి కఠిన హెచ్చరిక

**ఎల్బీనగర్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మల్కాజిగిరి ఉమెన్ సేఫ్టీ విభాగం డీసీపీ టి. ఉషారాణి స్పష్టం చేశారు. షీ టీమ్స్ ద్వారా నిరంతరం నిఘా కొనసాగిస్తూ, వేధింపులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫిబ్రవరి 16 నుంచి మార్చి 15 వరకు చేపట్టిన చర్యల వివరాలను ఆమె మంగళవారం వెల్లడించారు. గత నెల రోజుల్లో మొత్తం 223 ఫిర్యాదులు అందగా, వాటిలో 181 మంది పోకిరీలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిలో 148 మంది మేజర్లు కాగా, 33 మంది మైనర్లు ఉన్నారు.వేధింపుల రకాల్లో ఫోన్ కాల్స్ ద్వారా 57, సోషల్ మీడియా ద్వారా 53, ప్రత్యక్షంగా లేదా శారీరకంగా 113 కేసులు నమోదయ్యాయి. వీటిలో తీవ్రత ఆధారంగా 8 క్రిమినల్ కేసులు, 57 పెట్టీ కేసులు నమోదు చేయగా, మిగిలిన 122 మందికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.షీ టీమ్స్ విచారణలో పలు సంచలన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. పెళ్లి పేరుతో మోసం చేసి బాధితురాలిని గర్భస్రావానికి గురిచేసిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. మరో ఘటనలో విద్యార్థినిని సోషల్ మీడియా ద్వారా బ్లాక్‌మెయిల్ చేసిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే మహిళా ఉద్యోగులను వేధిస్తున్న ప్రైవేట్ కంపెనీ యజమానిపై కూడా చర్యలు తీసుకున్నారు.మహిళలకు కేటాయించిన మెట్రో కోచ్‌లలో ప్రయాణించిన 6 మంది పురుషులకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. అదేవిధంగా సమాజంలో అవగాహన పెంచేందుకు గత నెలలో 97 కార్యక్రమాలు నిర్వహించి, సుమారు 14,715 మందికి చట్టాలపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. మహిళలు ఎక్కడ ఉన్నా భయపడాల్సిన అవసరం లేదని, వేధింపులు ఎదురైతే వెంటనే షీ టీమ్ వాట్సాప్ నంబర్ 8712662111 లేదా సమీప పోలీసులను సంప్రదించాలని డీసీపీ ఉషారాణి సూచించారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఆమె హామీ ఇచ్చారు.

# ఉప్పల్‌లో చెరువులకు మహర్దశ...

- రూ.102 కోట్లతో అభివృద్ధి ప్రణాళిక
- నాచారం చెరువుకు రూ.30 కోట్లు
- ఆధునిక సదుపాయాలతో సుందరీకరణ



**ఉప్పల్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. మొత్తం రూ.102 కోట్లతో నియోజకవర్గంలోని చెరువులను అభివృద్ధి చేసి, సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.ఆయన ఆహ్వానం మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ నాచారం (హెచ్ఎంటి నగర్) పెద్ద చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ నాచారం చెరువుకు రూ.30 కోట్ల నిధులు కేటాయించి త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. చెరువును ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.మొదటి విడతలో ఉప్పల్ నల్లచెరువు (రూ.20 కోట్లు), నాచారం చెరువు (రూ.30 కోట్లు), కాప్రా చెరువు (రూ.35 కోట్లు), రామంతాపూర్ పెద్ద చెరువు (రూ.17 కోట్లు) అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు పరమేశ్వర్ రెడ్డి వివరించారు. ఇప్పటికే ఉప్పల్ నల్లచెరువులో పనులు తుదిదశకు చేరుకున్నాయని, మిగతా చెరువుల్లో కూడా త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు.ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని చెరువులను సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎంటి కాలనీ ప్రధాన కార్యదర్శి రామకోటేశ్వరరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, హెచ్ఆర్ మోహన్, ప్రకాష్ రెడ్డి, అశ్వర్థామ రెడ్డి, భావన గౌడ్, మహేష్ యాదవ్, రమేష్ గౌడ్ తదితరులతో పాటు చిలకనగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్దమందడిలో పారిశుద్ధ యజ్ఞం – కార్మికుల కష్టంతో పరిశుభ్రతకు కొత్త ఊపిరి



**పెద్దమందడి,మార్చి24(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో పారిశుద్ధ కార్మికులు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా కాలువలను శుభ్రం చేస్తూ కీలక సేవలు అందిస్తున్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మురుగును తొలగిస్తూ వారు నిరంతరం శ్రమిస్తున్నారు.ప్రతిరోజూ తెల్లవారుజామునే పనిలో నిమగ్నమవుతున్న ఈ కార్మికులు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెనకడుగు వేయకుండా తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. చేతి పరికరాలతో కాలువల్లో పేరుకుపోయిన మలినాలను తొలగిస్తూ.. నీటి ప్రవాహం సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.ఈ సందర్భంగా కార్మికులు మంగళవారం తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ.. పనికి తగ్గ వేతనాలు అందిస్తే మేము మరింత ఉత్సాహంగా సేవలందించగలుగుతాం.జీతం కంటే అదనంగా నెలకు 500 రూపాయలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఎవరైనా ముందుకు వచ్చి నెలకు 500 రూపాయలు అందిస్తే మాకు చాలా సహాయం అవుతుంది,అని తెలిపారు.స్థానిక ప్రజలు కూడా వారి సేవలను ప్రశంసిస్తూ, ఇలాంటి పారిశుద్ధ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని కోరుతున్నారు.కాలువలు శుభ్రంగా ఉండడం వల్ల వ్యాధులు తగ్గి, ఆరోగ్యకర వాతావరణం ఏర్పడుతుందని వారు పేర్కొన్నారు. ప్రజలు పారిశుద్ధ కార్మికుల కృషిని గౌరవించి, తమ పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో సహకరించాలని సూచించారు.వారి సేవలను గుర్తించిన గ్రామ సర్పంచ్ సూర్య గంగా ఉగాది పండుగ సందర్భంగా పారిశుద్ధ కార్మికులకు నూతన వస్త్రాలను అందజేసి గౌరవం తెలియజేశారు. ఈ సందర్భంగా కార్మికులు తమ కష్టానికి గుర్తింపు లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్‌కు భారీ షాక్ కాంగ్రెస్‌లోకి సీనియర్ నేతల చేరిక

- మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో 183 డివిజన్ నాయకుల సమూహ చేరిక



**మల్కాజ్గిరి, మార్చ్ 24 (తెలంగాణ ముచ్చట్లు)** మల్కాజిగిరి డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. 183 డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్, రామ్, శ్యామ్, పార్థసారథి, రామచందర్, శివ, కుమార్ తదితరులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని అధికారికంగా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అభివృద్ధి, ప్రజాసేవ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు సిరిగిరి నరసింహరావు, జీడి సత్యనారాయణ, వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జీడి చరణ్జిత్ గౌడ్, కొండా గౌడ్, భాస్కర్, మహేందర్ గౌడ్, రాజు యాదవ్, అరుణ్ గోగీకర్, సిరిగిరి సందీప్, రాజు గుప్తా తదితరులు పాల్గొన్నారు.ఈ చేరికలతో మల్కాజిగిరి ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ బలం మరింత పెరిగిందని పార్టీ నాయకులు తెలిపారు.

# బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమానికి మొండిచేయి

- రవికుమార్ టిఆర్పి జిల్లా యూత్ అధ్యక్షులు



**వనపర్తి,మార్చి24(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమ నిధి, ఇళ్ల స్థలాలు, హెల్త్ స్కీమ్‌లకు ప్రాధాన్యం లేకపోవడం పట్ల టిఆర్పి యూత్ జిల్లా అధ్యక్షుడు జి. రవికుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభమైన మీడియాను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.జర్నలిస్టులు ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే కీలక పాత్ర పోషిస్తారని, అలాంటి వారికి రక్షణగా ఉండే సంక్షేమ నిధిని బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం దురదృష్టకరమన్నారు.చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, వృద్ధాప్యంలో రూ.6 వేల పింఛన్, ప్రమాదాలు లేదా అనారోగ్య సమయంలో ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇస్తామని ప్రభుత్వం పలుమార్లు హామీ ఇచ్చినా బడ్జెట్‌లో వాటి గురించి ఎక్కడా ప్రస్తావించలేదని ఆయన ఆక్షేపించారు.జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం తక్షణమే బాధ్యత తీసుకుని సరైన చర్యలు చేపట్టాలని కోరారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఏసీబీకి చిక్కిన వైరా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

**ఖమ్మం బ్యూరో, మార్చి 24(తెలంగాణ ముచ్చట్లు):** వైరా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తన పరిధిలో నడుస్తున్న ఫిర్యాదుదారుడి రవాణా వాహనాలపై జరిమానాలు మరియు పెనాల్టీలు విధించకుండా ఉండేందుకు గాను, తన ప్రైవేట్ అసిస్టెంట్ రాజశేఖర్ ద్వారా రూ. 24,800/ లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ ఏ సి బి అధికారులు వైరాలోని ఆర్టీఓ యూనిట్ కార్యాలయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేశారు.



# అంగన్వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడాలి

- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
- **సిడిపిఓ లు అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలి**
- **ఆర్బిఎస్కే వైద్యుల ద్వారా సామ్ మ్యామ్ పిల్లలకు వైద్య పరీక్షల నిర్వహణ**
- **అంగన్వాడీల పని తీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం బ్యూరో, మార్చి 24(తెలంగాణ ముచ్చట్లు):** అంగన్వాడీ కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంగన్వాడీల పని తీరుపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి కేవలం 36 శాతం మంది పిల్లలు మాత్రమే 21 రోజుల కంటే ఎక్కువగా వస్తున్నారని అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం మంచి పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నప్పటికీ పిల్లలు రాకపోవడానికి గల కారణాలను గమనించాలని అన్నారు.

అంగన్వాడి కేంద్రాలలో పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు గమనిస్తూ లోపం ఉంటే వెంటనే అవసరమైన పోషకాలు అందించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఈ అంశాన్ని తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.సిడిపిఓలు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ ప్రజలలో విశ్వాసం కల్పించి అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలు రెగ్యులర్ గా వచ్చేలా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజు అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీ స్త్రీలు పిల్లల హాజరు చాలా కీలకమని అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో రిజిస్టరైన పిల్లలు కనీసం 85 శాతం కంటే ఎక్కువ హాజరు కావాలని కలెక్టర్ సిడిపిఓ అంగన్వాడీ టీచర్లను ఆదేశించారు.గర్భిణీ స్త్రీలు పిల్లలు బాలింతలు అంగన్వాడి కేంద్రాలకు వచ్చే హాజరు శాతం ఖమ్మం అర్బన్ మధిర మండలంలో చాలా తక్కువగా ఉందని అన్నారు. నిర్లక్ష్యం ఎట్టి పరిస్థితుల్లో సహించమని భవిష్యత్తులో ఇంప్రూవ్ కాకపోతే చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రతి సూపర్ వైజర్ తమ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను రెగ్యులర్ తనిఖీ చేస్తూ పని తీరు ఇంప్రూవ్ అయ్యేలా చూడాలని అన్నారు. ఏప్రిల్ నెలలో ఇంప్రూవ్ మెంట్ లేని పక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. మధిర ప్రాంతంలో గర్భిణీ మహిళలు బాలింతలతో సమావేశం నిర్వహించి వారికి అవసరమైన వసతులు అంగన్వాడీ కేంద్రంలో అందుబాటులో ఉండేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సిడిపిఓ మండల పరిధిలో ఎన్ని అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నారో రిపోర్టు తయారు చేయాలని ప్రతి నెలా కనీసం 15 రోజులు ఫీల్డ్ విజిట్స్ చేయాలని కలెక్టర్ అన్నారు. పిల్లల ఎదుగుదల రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తూ సామ్ మ్యామ్ పిల్లలను గుర్తించి వారికి అవసరమైన పోషకాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు ఆర్బీఎస్కే వైద్యులు పంపుతున్నామని పిల్లలకు అవసరమైన వైద్య పరీక్షలు వైద్యులు నిర్వహించేలా చూడాలని కలెక్టర్ తెలిపారు.

ఆర్బిఎస్కే వైద్య బృందాలు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసే ముందే సమాచారం అందిస్తే సామ్ మ్యామ్ పిల్లలను వైద్య పరీక్షలకు అందుబాటులో పెడతారని అంగన్వాడీ కేంద్రాలలో ఆర్.బీ.ఎస్.కే. వైద్యుల బృందం కనీసం రెండు గంటల సమయం గడపాలని కలెక్టర్ సూచించారు.రాబోయే నెల రోజుల వ్యవధిలో కనీసం 500 మంది పిల్లలు సామ్ మ్యామ్ నుంచి బయటపడేయడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాలో పిల్లలందరికీ ఆభా ఆధార్ అపార్ కార్డు 100 శాతం జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో మెనూ తప్పకుండా పాటించేలా చూడాలని పిల్లలకు గర్భిణీ స్త్రీలకు బాలింతలకు రెగ్యులర్ గా కోడి గుడ్లు పంపిణీ చేయాలని అన్నారు.

సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన మేర టాయిలెట్స్ విద్యుత్ సరఫరా త్రాగునీటి సరఫరా వంటి పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రదీప్ బాబు సిడిపిఓలు అంగన్వాడీ టీచర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు సత్తుపల్లిలో వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి పునః ప్రతిష్ట

- **భక్తులతో కిక్కిరిసేలా ఏర్పాట్లు.**
- **మహా అన్నదానానికి సన్నాహాలు పూర్తి.**



**సత్తుపల్లి, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక పట్టణంలోని హనుమాన్ నగర్‌లో వెలసిన సుమారు 400 సంవత్సరాల ప్రాచీన చరిత్ర కలిగిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నేడు పునః ప్రతిష్ఠ మహోత్సవంతో మళ్లీ భక్తులకు దర్శనమివ్వనుంది. బుధవారం ఉదయం 9 గంటలకు అర్చకుల మంత్రోచ్చారణల మధ్య, వేదఘోషల నడుమ ఈ మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. గత నాలుగు రోజులుగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతోంది. ప్రత్యేక పూజలు, హోమాలు, యజ్ఞాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందుతున్నారు. పునః ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా నేడు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వేలాది మంది భక్తులు పాల్గొనే అవకాశముందని భావించి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, ప్రసాదాలు, కూర్చునే సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, "ప్రాచీన వైభవాన్ని తిరిగి తీసుకొచ్చే ఈ పునః ప్రతిష్ట మహోత్సవం ప్రతి భక్తునికి ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తుంది" అని తెలిపారు. సత్తుపల్లి పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంచాలని డిమాండ్

**ఎల్కతుర్తి, మార్చి 24( తెలంగాణ ముచ్చట్లు):** ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న పథకాల దరఖాస్తుల గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జాతీయ కమిటీ సభ్యుడు, దళిత రత్న అవార్డు గ్రహీత సాతూరి వెంకన్న మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మంగళవారం ఆయన మాట్లాడుతూ, పథకాల దరఖాస్తుల సమాచారం సామాజిక మాధ్యమాల ద్వారా కొంతమంది లబ్ధిదారులకు మాత్రమే చేరిందని, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అనేక మంది అర్హులైన అభ్యర్థులకు సరైన సమాచారం అందలేదని తెలిపారు.

సమాచారం లోపం వల్ల అనేక మంది లబ్ధిదారులు అవకాశాన్ని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

దరఖాస్తు గడువును మరికొద్ది రోజులు పొడిగిస్తే అర్హులైన వారందరికీ సమాన అవకాశం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా వాహనాల మంజూరు పథకానికి భారీ డిమాండ్ ఉన్న నేపథ్యంలో, దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి వాహనాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అలాగే, పథకాలపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అధికార యంత్రాంగం గ్రామస్థాయిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అర్హులైన లబ్ధిదారులకు సహాయం అందించాలని ఆయన సూచించారు. దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేసి, ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ విధానాలను కూడా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

ఇకపై ఇలాంటి పథకాల సమాచారాన్ని ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఎవరూ అవకాశాన్ని కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి గడువు పొడిగింపుపై స్పష్టత ఇవ్వాలని సాతూరి వెంకన్న మాదిగ విజ్ఞప్తి చేశారు.



# మార్చి 28న జాతీయ లోక్ అదాలత్

- **మల్కాజిగిరి జిల్లా కోర్ట్ సహా అన్ని కోర్టుల్లో నిర్వహణ**
- **కేసుల త్వరిత పరిష్కారానికి అవకాశం**

**కుషాయిగూడ, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ మరియు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, మల్కాజిగిరి జిల్లా కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి శ్రీ వి. బాల భాస్కర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.కుషాయిగూడలోని మల్కాజిగిరి జిల్లా కోర్ట్ ఆవరణతో పాటు జిల్లాలోని అన్ని కోర్టు భవన సముదాయాల్లో ఈ లోక్ అదాలత్ జరుగుతుందని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.ఈ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులతో పాటు రాజీపడదగిన క్రిమినల్ కేసులు, వాహన ప్రమాదాలకు సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీలు, చెక్కు బౌన్స్ కేసులు, భూ వివాదాలు వంటి అనేక అంశాలపై కేసులను పరిష్కరించుకునే వీలుందని తెలిపారు.

లోక్ అదాలత్ ద్వారా సమయం, ఖర్చులు ఆదా అవుతాయని, పరస్పర అంగీకారంతో కేసులు ముగిసే అవకాశం ఉండటంతో సత్వర న్యాయం పొందవచ్చని న్యాయమూర్తి సూచించారు.

# ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు భారీ దెబ్బ

- **18 మంది లొంగుబాటు**
- **డీకేఎస్‌జెడ్‌సీ సభ్యుడు పప్పారావుతో పాటు కీలక నేతల లొంగుబాటు**
- **హింస విడిచి ప్రధాన ప్రవాహంలోకి రావాలని నిర్ణయం**
- **ఆయుధాల సమర్పణ, పునరావాస ప్రక్రియ ప్రారంభం**

**డెస్క్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ ప్రాంతంలో ఎడమపక్ష తీవ్రవాదంపై ప్రభుత్వం చేపట్టిన చర్యలకు కీలక ఫలితం దక్కింది. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జెడ్‌సీ) సభ్యుడు పప్పారావు సహా మొత్తం 18 మంది మావోయిస్టు కార్యకర్తలు లొంగుబాటు అయ్యారు. ఈ విషయాన్ని బస్తర్ ఐజీ పి సుందరరాజ్ వెల్లడించారు. లొంగుబాటు చేసిన వారిలో డీకేఎస్‌జెడ్‌సీ సభ్యుడు పప్పారావుతో పాటు డివిజనల్ కమిటీ సభ్యులు ప్రకాష్ మడవి, అనిల్ తట్టి కూడా ఉన్నారు. ఈ గుంపులో మొత్తం 18 మంది ఉండగా, అందులో 7 మంది మహిళా కేడర్లు ఉన్నారు. వీరంతా హింసను విడిచిపెట్టి సాధారణ జీవితంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు అధికారులు తెలిపారు.

లొంగుబాటు ప్రక్రియలో భాగంగా మావోయిస్టులు తమ వద్ద ఉన్న ఏకే47 తుపాకులు సహా ఇతర ఆయుధాలను సమర్పించనున్నట్లు సమాచారం. ప్రభుత్వం ప్రకటించిన పునరావాస విధానాల ప్రకారం వీరిని తిరిగి సామాజిక జీవనంలో కలపడానికి చర్యలు చేపడుతున్నారు. దక్షిణ ఉప జోనల్ బ్యూరో పరిధిలోని ఈ కేడర్ల పునరావాస ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. ఈ పరిణామం బస్తర్ ప్రాంతంలో ఎడమపక్ష తీవ్రవాదానికి గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న శాంతి చర్చలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగానే మావోయిస్టులు లొంగుబాటుకు ముందుకు వస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు. మొత్తానికి, హింసకు ముగింపు పలికి ప్రధాన ప్రవాహంలోకి రావాలన్న నిర్ణయం ప్రాంతంలో శాంతి స్థాపనకు దోహదపడనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు కొనసాగితే మరింత మంది మావోయిస్టులు లొంగుబాటుకు వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.



# భారత్–శ్రీలంక మధ్య కీలక చర్చలు

- **ఇంధన భద్రతపై మోదీ ఫోకస్**
- **పశ్చిమ ఆసియా పరిస్థితులపై సమీక్ష**
- **ఇంధన సహకారంపై రెండు దేశాల చర్చలు**
- **ప్రాంతీయ భద్రత బలోపేతానికి అంకిత భావం**

**న్యూఢిల్లీ, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమ ఆసియాలో నెలకొన్న తాజా పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ ఇంధన భద్రతపై ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసానాయకతో కీలకంగా చర్చలు జరిపారు. గ్లోబల్ స్థాయిలో ఇంధన సరఫరా వ్యవస్థలో ఏర్పడుతున్న అంతరాయాలపై ఇరువురు నేతలు సమీక్షించారు. ఈ సందర్భంగా భారత్-శ్రీలంక మధ్య ఇంధన రంగంలో కొనసాగుతున్న కీలక ప్రాజెక్టుల పురోగతిని కూడా పరిశీలించారు. ఇంధన సహకారాన్ని మరింత బలోపేతం చేసి, రెండు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ప్రాంతీయ స్థాయిలో ఇంధన భద్రతను పెంచేందుకు సంయుక్తంగా పనిచేయాలని అభిప్రాయపడ్డారు.

పశ్చిమ ఆసియాలో మారుతున్న పరిస్థితులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరాన్ని మోదీ ప్రస్తావించారు. ఇంధన వనరుల వినియోగంలో సమన్వయం పెంచడం ద్వారా సమస్యలను ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. భారత్, శ్రీలంక మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలు ఇలాంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు కీలకమని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. పరస్పర నమ్మకంతో కలిసి పనిచేస్తే ప్రాంతీయ భద్రత మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. మొత్తంగా ఇరుదేశాలు పరస్పర సహకారంతో ముందుకు సాగుతూ, ఉమ్మడి సమస్యలకు సంయుక్త పరిష్కారాలు కనుగొనడానికి కట్టుబడి ఉన్నట్లు మోదీ స్పష్టం చేశారు. భారత్-శ్రీలంక భాగస్వామ్యం భవిష్యత్తులో మరింత బలపడనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# సంకెళ్లు తెంచుకున్న చరిత్ర మానవత్వానికి అద్దం పట్టే స్మరణ

**డెస్క్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** మానవ చరిత్రలో అత్యంత క్రూరమైన మరియు అమానవీయమైన ఘట్టాలలో ట్రాన్స్అట్లాంటిక్ బానిస వ్యాపారం ఒకటి. దాదాపు 400 ఏళ్ల పాటు సాగిన ఈ చీకటి వ్యాపారంలో లక్షలాది మంది ఆఫ్రికన్లను బలవంతంగా తమ మాతృభూమి నుండి వేరు చేసి, బానిసలుగా విదేశాలకు తరలించారు. ఈ దారుణమైన ప్రయాణంలో మరియు బానిసత్వపు సంకెళ్లలో ప్రాణాలు కోల్పోయిన కోట్లాది మంది బాధితులను స్మరించుకోవడానికి ప్రతి ఏటా మార్చి 25న 'బానిసత్వ బాధితుల జ్ఞాపకార్థ అంతర్జాతీయ దినోత్సవం' నిర్వహించబడుతోంది. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన ఈ రోజు, గతంలోని తప్పులను గుర్తుచేసుకోవడమే కాకుండా, వర్తమానంలో మానవ గౌరవాన్ని కాపాడాలని మనకు చాటి చెబుతోంది. ఒక మనిషిని మరొక మనిషి వస్తువులా చూడటం అనేది నాగరికతకే మచ్చ అని ఈ రోజు మనకు గుర్తుచేస్తుంది. ఈ బానిస వ్యాపారం కేవలం ఆర్థిక లాభాల కోసం జరిగింది మాత్రమే కాదు, అది ఒక జాతిపై మరొక జాతి సాగించిన వ్యవస్థీకృత అణచివేతకు నిదర్శనం. సముద్ర ప్రయాణాల్లోనే వేలాది మంది ఆకలితో, రోగాలతో మరణించగా, ప్రాణాలతో మిగిలిన వారు అమెరికా, కరేబియన్ తీరాల్లో కఠినమైన శ్రమకు గురయ్యారు. వారి ప్రాథమిక హక్కులను కాలరాస్తూ, వారిని మనుషులుగా కాకుండా కేవలం శ్రమను ఇచ్చే యంత్రాలుగా చూడటం చరిత్రలో ఒక చెరపలేని మచ్చగా మిగిలిపోయింది. ఈ రోజున మనం ఆ బాధితుల పోరాటాన్ని, వారి అచంచలమైన సహనాన్ని మరియు ఆత్మగౌరవాన్ని గుర్తుచేసుకోవాలి. వారు అనుభవించిన హింస మరియు వారు చూపిన పట్టుదల నేటి తరానికి స్వేచ్ఛ మరియు మానవ హక్కుల అసలు విలువను కళ్ళకు కట్టినట్లు తెలియజేస్తుంది.

నేటికీ ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో ఆధునిక బానిసత్వం వివిధ రూపాల్లో రూపాంతరం చెంది కొనసాగుతూనే ఉంది. వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ మరియు వివక్ష వంటివి నేటి ఆధునిక సమాజానికి పెద్ద సవాళ్లుగా మారాయి. జాతి వివక్ష అనే మహమ్మారి ఈ బానిసత్వ సంస్కృతి నుండే వేళ్లూనుకుందని సామాజిక శాస్త్రవేత్తలు బలంగా విశ్వసిస్తుంటారు. అందుకే, ఈ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా కేవలం గతాన్ని స్మరించడమే కాకుండా, వర్తమానంలో ఉన్న జాతి వివక్షకు వ్యతిరేకంగా గొంతు ఎత్తడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత. రంగు, జాతి, కులం లేదా ప్రాంతం ఆధారంగా ఎవరినీ తక్కువ చేసి చూడకూడదనే విశ్వజనీన సందేశాన్ని ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా బలంగా వినిపిస్తోంది.



ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో ఈ బానిసత్వ చరిత్ర గురించి మరియు దానివల్ల జరిగిన నష్టం గురించి రాబోయే తరాలకు స్పష్టంగా బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చరిత్రను మర్చిపోతే మళ్ళీ అవే తప్పులు పునరావృతం అయ్యే ప్రమాదం ఉంటుందని ఐక్యరాజ్యసమితి పదే పదే హెచ్చరిస్తోంది. యువతలో మానవతా విలువలను, సాటి మనిషి పట్ల గౌరవాన్ని పెంపొందించడం ద్వారా మాత్రమే మనం ఒక నిజమైన సమసమాజాన్ని నిర్మించగలము. బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వీరుల గాథలను, వారి త్యాగాలను ప్రచారం చేయడం ద్వారా స్వేచ్ఛ యొక్క ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ వివరించాలి. అనేక దేశాల్లో ఈ రోజున ప్రత్యేక చిత్ర ప్రదర్శనలు, చర్చా వేదికలు ఏర్పాటు చేసి బాధితుల ఆత్మలకు శాంతి చేకూర్చేలా నివాళులు అర్పిస్తున్నారు. బానిసత్వం అనేది కేవలం భౌతికమైన సంకెళ్లకు సంబంధించింది మాత్రమే కాదు, అది మనిషి యొక్క మానసిక స్థితిని కూడా దెబ్బతీస్తుంది. తరతరాలుగా సాగిన ఈ అణచివేత వల్ల కొన్ని జాతులు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిపోయాయి. ఈ అసమానతలను తొలగించడం ద్వారానే మనం ఆనాటి బాధితులకు నిజమైన న్యాయం చేసిన వారమవుతాము. నేటి ప్రజాస్వామ్య దేశాలు తమ చట్టాలలో మానవ హక్కులకు పెద్దపీట వేయాలి. ఏ ఒక్క వ్యక్తి కూడా మరొకరి అండ చూసుకుని అహంకారంతో ప్రవర్తించకుండా, అందరూ సమానమే అనే రాజ్యాంగబద్ధమైన విలువలను కాపాడాలి. ఈ అంతర్జాతీయ దినోత్సవం అటువంటి సమైక్యతను పెంపొందించడానికి ఒక వేదికగా నిలవాలి. మనం జీవిస్తున్న ఈ సమాజంలో అదృశ్య రూపంలో ఉన్న బానిసత్వాన్ని గుర్తించడం కూడా చాలా ముఖ్యం. ముఖ్యంగా వలస కార్మికుల పట్ల చూపే వివక్ష, తక్కువ వేతనానికి ఎక్కువ పని చేయించుకోవడం వంటివి కూడా బానిసత్వపు పోకడలే. అటువంటి బాధితుల తరఫున నిలబడటం, వారికి న్యాయం చేకూర్చడం ఈ రోజు యొక్క అసలైన అంతరార్థం. అంతర్జాతీయ సమాజం ఏకతాటిపై నిలిచి మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా కఠినమైన చట్టాలను అమలు చేయాలి. సమాచార సాంకేతికత పెరిగిన ఈ రోజుల్లో, సోషల్ మీడియా ద్వారా కూడా మానవ హక్కుల పట్ల అవగాహన కల్పించవచ్చు. ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా మెలగడం వల్లనే అణచివేత లేని సమాజం సాధ్యమవుతుంది. ట్రాన్స్అట్లాంటిక్ బానిస వ్యాపారం సమయంలో ఆఫ్రికన్ సంస్కృతిని నాశనం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. కానీ, ఆ బాధితులు తమ కళలను, సంగీతాన్ని మరియు సంప్రదాయాలను తమ హృదయాల్లో దాచుకుని, వాటిని తరువాతి తరాలకు అందించారు. ఈ రోజు మనం చూస్తున్న అనేక సంగీత రూపాలు, కళలు ఆ పోరాట పటిమ నుండే ఉద్భవించాయి. వారి సంస్కృతిని గౌరవించడం అంటే వారి ఉనికిని గుర్తించడమే. వైవిధ్యంలో ఏకత్వాన్ని సాధించడమే మానవాళి లక్ష్యం కావాలి. జాతి వివక్ష లేని ప్రపంచం కోసం జరిగే ప్రతి పోరాటం ఈ రోజు స్ఫూర్తితోనే ముందుకు సాగాలి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మానవ హక్కుల సంఘాలు ఈ దిశగా నిరంతరం కృషి చేయాలి.

ముగింపుగా, స్వేచ్ఛ అనేది ప్రతి మనిషికి ప్రకృతి ప్రసాదించిన వరం, దాన్ని హరించే అధికారం ఏ వ్యవస్థకు లేదు. బానిసత్వపు సంకెళ్లు తెంచుకుని స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడానికి మన పూర్వీకులు చేసిన వీరోచిత పోరాటం వృథా కాకూడదు. నేటి సమాజంలో ఏ రూపంలోనైనా, ఏ మూలనైనా అణచివేత కనిపిస్తే దాన్ని ఎదిరించడమే మనం ఆనాటి బాధితులకు అర్పించే నిజమైన నివాళి. ప్రపంచమంతా ఒక్కటే అనే భావనతో, సోదరభావంతో మెలగడం ద్వారానే మనం ఒక శాంతియుత మరియు గౌరవప్రదమైన భవిష్యత్తును నిర్మించగలము. ఈ మార్చి 25న మనం మరోసారి మానవత్వం వైపు అడుగులు వేయాలని, అందరూ సమానమే అనే భావనను చాటి చెప్పాలని ప్రతిజ్ఞ చేద్దాం. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకుంటూనే, తోటి మనిషిని గౌరవించే సంస్కృతిని మనం అలవర్చుకోవాలి. బానిసత్వం వల్ల కలిగిన గాయాలను మానపడానికి ప్రేమ, కరుణ మరియు సమానత్వం అనేవి మందులా పనిచేస్తాయి. అంతర్జాతీయ వేదికలపై ఈ చర్చ నిరంతరం జరగాలి. ఏ దేశంలోనైనా సరే, మనిషి స్వేచ్ఛకు భంగం కలిగితే అది మొత్తం ప్రపంచానికే ప్రమాదమని గుర్తించాలి. అందుకే, బానిసత్వ బాధితుల జ్ఞాపకార్థ దినోత్సవం మనందరినీ ఒక్కతాటిపైకి తెచ్చి, మానవ హక్కుల పరిరక్షణకు పునరంకితం కావాలని కోరుకుందాం. నేటి సంపాదకీయం ద్వారా మేము కోరుకునేది ఒక్కటే వివక్ష లేని లోకం, స్వేచ్ఛతో నిండిన ప్రతి ప్రాణం.

భవిష్యత్తు తరాలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి స్వేచ్ఛా పూరితమైన సమాజమే. గతం నేర్పిన పాఠాలను గుర్తుంచుకుని, వర్తమానంలో తప్పులు దిద్దుకుంటూ, సుందరమైన రేపటిని నిర్మించుకుందాం. బానిసత్వం అనే పదమే నిఘంటువులో ఉండకూడదని, ప్రతి మనిషి గౌరవంగా తల ఎత్తుకుని బ్రతికే రోజు రావాలని ఆకాంక్షిద్దాం. ఈ దిశగా సాగే ప్రతి అడుగులోనూ 'డిజైనర్ టెక్ గురు' ఎప్పుడూ ముందుంటుంది. మానవత్వం వర్ధిల్లాలి, అణచివేత నశించాలి అనే నినాదంతో మనం ముందడుగు వేద్దాం. ఈ అంతర్జాతీయ దినోత్సవం మనలో సరికొత్త ఆలోచనలను, బాధ్యతలను నింపుతుందని ఆశిస్తున్నాం.

# ఖనిజ సంపదతో సమగ్ర అభివృద్ధి...

- డీఎంఎఫ్ సదస్సులో కిషన్ రెడ్డి సందేశం
- ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు
- సహకార ఫెడరలిజంతో డీఎంఎఫ్ బలోపేతం
- డిజిటల్ నవీనతలకు ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ జిల్లా ఖనిజ ఫౌండేషన్ సదస్సు-2026 ముగింపు కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి కీలక ప్రసంగం చేశారు. ఖనిజ సంపదను ప్రజల సంక్షేమానికి ఉపయోగించాలంటే సమగ్ర దృక్పథంతో ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వినూత్న, ప్రాయోగిక విధానాలు అవసరమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్, బిసాగ్ఎన్, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సహకార ఫెడరలిజం భావంతో డీఎంఎఫ్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని తెలిపారు. కేంద్ర-రాష్ట్రాల సమన్వయం ద్వారా ఖనిజ వనరులను సమర్థంగా వినియోగించి ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజన్‌కు అనుగుణంగా ఖనిజ సంపద సమగ్ర, దీర్ఘకాలిక అభివృద్ధికి దోహదపడాలని ఆయన అన్నారు. 'రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్' మంత్రంతో ముందుకు సాగితేనే దేశాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. డీఎంఎఫ్ కార్యకలాపాల్లో డిజిటల్ టెక్నాలజీ వినియోగం కీలకమని ఆయన వివరించారు. డీఎంఎఫ్ పోర్టల్ 2.0 వంటి వేదికలను సమర్థంగా వినియోగించి పారదర్శకత, సమర్థత పెంచాలని సూచించారు. ఆధునిక సాంకేతికత ద్వారా సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని అన్నారు. సదస్సులో పాల్గొన్న ప్రతినిధుల సూచనలను గౌరవంగా పరిగణించి, వాటిని అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే ప్రతి ప్రయత్నానికి తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.

# దేశ రక్షణ రంగంలో స్వదేశీకరణకు వేగం

- సిడిఎస్ కీలక సూచనలు
- దిగుమతులపై ఆధారాన్ని తగ్గించాలి
- ఆర్అండ్‌డీ, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి
- రక్షణ తయారీ సామర్థ్యాల పెంపు లక్ష్యం

**డెస్క్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ రక్షణ రంగంలో స్వదేశీకరణను వేగవంతం చేయాల్సిన అవసరాన్ని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ ప్రస్తావించారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫాక్చరర్స్ ప్రతినిధులతో ఆయన సమావేశమై, కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా కీలక సాంకేతిక రంగాల్లో దిగుమతులపై ఆధారాన్ని తగ్గించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా రక్షణ ఉత్పత్తుల తయారీ కాలాన్ని తగ్గించడంతో పాటు, దేశీయ పరిశ్రమలు మరింత చురుకుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను బలోపేతం చేయడం ద్వారా నాణ్యమైన మానవ వనరులను తయారు చేయాలని సూచించారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ రంగంలో పెట్టుబడులను పెంచాలని పరిశ్రమలను ప్రోత్సహించారు. అదేవిధంగా కోడెవలప్‌మెంట్, సామర్థ్యాల పెంపు, నాణ్యత నియంత్రణ అంశాల్లో సమగ్ర చర్యలు తీసుకోవాలని తెలిపారు. టెక్నాలజీ లోటును తగ్గించడానికి పరిశ్రమలు కలిసి పనిచేయాలని సూచించారు. సరఫరా గొలుసు వ్యవస్థను బలోపేతం చేసి, అత్యవసర పరిస్థితుల్లో సన్నద్ధత పెంచుకోవాలని పేర్కొన్నారు. మొత్తంగా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలను సాధించేందుకు రక్షణ రంగంలో స్వదేశీ తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని సిడిఎస్ స్పష్టం చేశారు. దేశ భద్రతకు అవసరమైన అన్ని రంగాల్లో స్వయం సమృద్ధిని సాధించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

# ఎలక్ట్రిక్ వాహనాల విప్లవం

- పర్యావరణ హితం మరియు భవిష్యత్తు సవాళ్లు
- పర్యావరణ పరిరక్షణకు పెరిగిన విద్యుత్ వాహనాల వినియోగం
- ఇంధన ధరల భారం నుండి సామాన్యుడికి లభించనున్న ఊరట
- మౌలిక సదుపాయాల కల్పన మరియు పునరావేశ కేంద్రాల ఆవశ్యకత

**డెస్క్, మార్చి 24 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రస్తుత తరుణంలో ప్రపంచవ్యాప్తంగా శిలాజ ఇంధనాల వాడకం వల్ల పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోంది. భూతాపం పెరిగిపోవడంతో పాటు గాలి నాణ్యత క్షీణిస్తోంది, దీనికి ప్రధాన కారణం పెట్రోల్ మరియు డీజిల్ వాహనాల నుండి వెలువడే కర్బన ఉద్గారాలే. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలు ఒక అద్భుతమైన ప్రత్యామ్నాయంగా అవతరించాయి. విద్యుత్ వాహనాల వల్ల శబ్ద కాలుష్యం తగ్గడమే కాకుండా, ప్రకృతికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వాలు కూడా పర్యావరణ హితమైన రవాణా వ్యవస్థను ప్రోత్సహించడానికి భారీగా రాయితీలు ప్రకటిస్తూ ప్రజలను విద్యుత్ వాహనాల వైపు మళ్లించేలా చర్యలు చేపడుతున్నాయి. గాలిలో చేరే విషవాయువులను తగ్గించి, భావి తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించడంలో ఈ వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయి. సామాన్యుడి విషయానికి వస్తే, రోజురోజుకూ ఆకాశాన్ని తాకుతున్న చమురు ధరలు కుటుంబ బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. ప్రతి కిలోమీటరు ప్రయాణానికి అయ్యే ఖర్చును లెక్క వేసుకుంటే, సంప్రదాయ ఇంధన వాహనాల కంటే విద్యుత్ వాహనాలు చాలా తక్కువ ఖర్చుతో కూడుకున్నవి. వాహన నిర్వహణ వ్యయం కూడా చాలా తక్కువగా ఉండటం వల్ల మధ్యతరగతి ప్రజలు ఈ వాహనాల పట్ల మక్కువ చూపుతున్నారు. యంత్ర చమురు మార్చడం లేదా క్లిష్టమైన యాంత్రిక భాగాల మరమ్మతులు వంటి ఇబ్బందులు విద్యుత్ వాహనాల్లో ఉండవు. బ్యాటరీ సాంకేతికతలో వస్తున్న మార్పుల వల్ల ఒకసారి విద్యుత్ నింపితే ఎక్కువ దూరం ప్రయాణించే వీలు కలగడం, వినియోగదారులలో నమ్మకాన్ని పెంచుతోంది. ఇది దీర్ఘకాలంలో సామాన్యుడికి ఆర్థికంగా ఎంతో ప్రయోజనకరంగా మారుతుంది. అయితే విద్యుత్ వాహనాల వినియోగం పూర్తి స్థాయిలో విజయవంతం కావాలంటే మౌలిక సదుపాయాల కల్పన అత్యంత కీలకం. ప్రస్తుతం ఉన్న ప్రధాన సమస్య పునరావేశ కేంద్రాల లభ్యత. సుదూర ప్రయాణాలు చేసేటప్పుడు దారి పొడవునా విద్యుత్ నింపుకునే కేంద్రాలు లేకపోవడం వల్ల వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. చమురు కేంద్రాల తరహాలోనే ప్రతి గృహ సముదాయంలో, వాణిజ్య కేంద్రాలలో మరియు రహదారుల వెంబడి వేగవంతమైన పునరావేశ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే ప్రజలు ఎటువంటి భయం లేకుండా విద్యుత్ వాహనాలను కొనుగోలు చేయడానికి ముందుకు వస్తారు. ఈ విషయంలో ప్రభుత్వం మరియు ప్రైవేట్ సంస్థలు సమన్వయంతో పని చేయాలి. జాతీయ రహదారుల వెంబడి ప్రతి కొద్ది దూరానికి ఒక కేంద్రం ఉంటే ఈ రంగం ఊహించని రీతిలో అభివృద్ధి చెందుతుంది. సాంకేతికపరంగా చూస్తే, బ్యాటరీల తయారీ మరియు వాటి పునరుద్ధరణ కూడా పెద్ద సవాలుగా మారింది. విద్యుత్ వాహనాల్లో వాడే లిథియం బ్యాటరీల ఖరీదు ఎక్కువగా ఉండటం వల్ల వాహనాల ధరలు కూడా పెరుగుతున్నాయి. స్వదేశీయంగా బ్యాటరీల తయారీని ప్రోత్సహించడం ద్వారా దిగుమతి ఖర్చులను తగ్గించే అవకాశం ఉంటుంది. అలాగే, కాలం చెల్లిన బ్యాటరీలను పర్యావరణానికి హాని కలగకుండా తిరిగి వినియోగంలోకి తెచ్చే పద్ధతులను అభివృద్ధి చేయాలి. బ్యాటరీ వ్యర్థాల నిర్వహణ అనేది రాబోయే రోజుల్లో పెద్ద సమస్య కాకుండా ఇప్పుడే కఠినమైన నిబంధనలు రూపొందించాలి. ఇలాంటి సాంకేతిక సవాళ్లను శాస్త్రీయంగా అధిగమించినప్పుడే విద్యుత్ విప్లవం సుస్థిరంగా మారుతుంది. పరిశోధనలు మరియు నూతన ఆవిష్కరణలు ఈ రంగంలో కొత్త పుంతలు తొక్కాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రభుత్వాల పరంగా చూస్తే, వివిధ పథకాల ద్వారా అందిస్తున్న రాయితీలు




వాహనదారులకు పెద్ద ఊరటనిస్తున్నాయి. నమోదు రుసుము మినహాయింపు, రహదారి పన్ను తగ్గింపు వంటి చర్యలు ఈ రంగం వైపు ప్రజలు అడుగులు వేసేలా చేస్తున్నాయి. కానీ ఈ ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో సామాన్యుడికి సులభంగా అందేలా చూడాలి. ప్రభుత్వ రవాణా వ్యవస్థలో కూడా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడం వల్ల కాలుష్యం తగ్గడమే కాకుండా రవాణా సంస్థల ఆర్థిక భారం కూడా తగ్గుతుంది. విద్యుత్ తయారీ కూడా పునరుత్పాదక ఇంధన వనరులైన సౌర మరియు పవన శక్తి ద్వారా జరిగితేనే ఈ వాహనాల అసలైన ఉద్దేశ్యం నెరవేరుతుంది. లేదంటే బొగ్గుతో తయారైన విద్యుత్ వాడకం వల్ల కాలుష్యం మరో రూపంలో కొనసాగుతూనే ఉంటుంది కాబట్టి స్వచ్ఛ ఇంధనంపై దృష్టి సారించాలి. వాహన తయారీ సంస్థలు కూడా వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా విభిన్న రకాలను అందుబాటులోకి తేవాలి. కేవలం ఖరీదైన కార్లే కాకుండా, సామాన్యుడికి అందుబాటులో ఉండే ద్విచక్ర మరియు త్రిచక్ర వాహనాల నాణ్యతను పెంచాలి. బ్యాటరీల భద్రత విషయంలో ఎటువంటి రాజీ పడకుండా ప్రమాదాలు జరగకుండా అత్యున్నత ప్రమాణాలను పాటించాలి. గతంలో కొన్ని వాహనాల్లో జరిగిన అగ్నిప్రమాదాలు ప్రజల్లో కొంత భయాన్ని నింపాయి, ఆ భయాన్ని పోగొట్టేలా కంపెనీలు పూర్తి భరోసా ఇవ్వాలి. బ్యాటరీ బాధ్యత కాలాన్ని పెంచడం మరియు విడిభాగాల లభ్యతను సులభతరం చేయడం ద్వారా ఈ మార్కెట్ మరింత విస్తరిస్తుంది. కొత్త తరహా వ్యాపార నమూనాలు అంటే బ్యాటరీ మార్పిడి వంటివి అమలులోకి వస్తే విద్యుత్ నింపే సమయం కూడా గణనీయంగా తగ్గుతుంది.

యువత మరియు ఉద్యోగ అవకాశాల పరంగా చూస్తే, విద్యుత్ వాహనాల రంగం కొత్త ఉపాధి మార్గాలను సృష్టిస్తోంది. వాహన మరమ్మతులు, బ్యాటరీ తయారీ, సాఫ్ట్‌వేర్ నిర్వహణ మరియు పునరావేశ కేంద్రాల నిర్వహణలో వేల సంఖ్యలో ఉద్యోగాలు లభించనున్నాయి. సాంకేతిక విద్యార్థులు కూడా ఈ కొత్త విజ్ఞానం వైపు మొగ్గు చూపుతున్నారు. విద్యాసంస్థలు ఈ సాంకేతికతను తమ పాఠ్యప్రణాళికలో చేర్చి నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయాలి. నూతన పరిశ్రమలు ఈ రంగంలో వినూత్నమైన ఆలోచనలతో వస్తున్నాయి, ఇది దేశీయ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊతాన్నిస్తుంది. దేశీయంగా తయారైన వాహనాలను విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని కూడా సంపాదించి దేశ ప్రగతికి తోడ్పడవచ్చు. ముగింపుగా చూస్తే, విద్యుత్ వాహనాల భవిష్యత్తు ఎంతో ఆశాజనకంగా కనిపిస్తోంది. రాబోయే దశాబ్ద కాలంలో మెజారిటీ వాహనాలు విద్యుత్ శక్తితోనే నడిచే అవకాశం ఉంది. వాహన తయారీ సంస్థలు కూడా అత్యాధునిక వసతులతో తక్కువ ధరలోనే నాణ్యమైన వాహనాలను మార్కెట్లోకి తెస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోవాలనే స్పృహ ప్రజల్లో పెరుగుతుండటం, ఇంధన ధరల భారం తగ్గించుకోవాలనే ఆలోచన ఈ మార్పును వేగవంతం చేస్తాయి. సరైన ప్రణాళికతో పునరావేశ వ్యవస్థను బలోపేతం చేసి, ప్రజల్లో అవగాహన పెంచితే, భారతదేశ రవాణా వ్యవస్థలో విద్యుత్ వాహనాలు ఒక మైలురాయిగా నిలుస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇది కేవలం సాంకేతిక మార్పు మాత్రమే కాదు, రాబోయే తరాలకు మనం ఇచ్చే కాలుష్య రహితమైన బహుమతి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




# 'ఏఏ22'లో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్..?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'ఏఏ22'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ దక్షిణంతో పాటు ఉత్తర భారతదేశంలో కూడా భారీ హైప్‌ను సృష్టించింది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రచార కంటెంట్ విడుదల చేయకుండా మేకర్స్ గట్టి రహస్యాన్ని కొనసాగిస్తున్నారు.

ఇటీవల అట్లీ తన సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న ఒక లయన్ పోస్టర్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీంతో ఈ చిత్రంలో అల్లు అర్జున్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, బహుముఖ పాత్రలో నటిస్తున్నారా? అన్న అనుమానాలు అభిమానుల్లో మొదలయ్యాయి.

అట్లీ పోస్టర్‌కు జతచేసిన "నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి" అనే వ్యాఖ్య మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది హీరో పాత్రలోని విభిన్న కోణాలను సూచిస్తోందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ సుమారు 600 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. అల్లు అర్జున్ ఇప్పటికే పాన్ ఇండియా స్టార్‌గా తన స్థాయిని నిరూపించుకోగా, అట్లీ తన మాస్ కమర్షియల్ శైలితో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టిస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 8న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదలయ్యే అవకాశం ఉందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అభిమానులు ఆ రోజుకై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. లయన్ పోస్టర్ నిజంగా కథపై సంకేతమా? లేక కేవలం ఆసక్తి పెంచే ప్రయత్నమా? అన్నది టీజర్ విడుదలయ్యే వరకు వేచి చూడాల్సిందే.

# టొవినో థామస్ 'పల్లిచట్టంబి' తెలుగు టీజర్ విడుదల




మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ ప్రధాన పాత్రలో నటించిన పీరియడ్ యాక్షన్ డ్రామా పల్లిచట్టంబి తెలుగు టీజర్‌ను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 10న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

టీజర్‌ను పరిశీలిస్తే, ఈ చిత్రం చారిత్రక నేపథ్యంతో తెరకెక్కిందని స్పష్టంగా తెలుస్తోంది. ఇందులో టొవినో థామస్ మాస్, పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. 19వ శతాబ్దపు కేరళ సామాజిక పరిస్థితులను తెరపై జీవంగా చూపించేందుకు దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు టీజర్ ద్వారా అర్థమవుతోంది.

ఈ చిత్రానికి డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో 'క్వీన్', 'జన గణ మన' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ఆయన ఈ సినిమాను కూడా భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. ఇందులో హీరోయిన్‌గా కయాడ్ లోహార్ నటిస్తోంది. 'పల్లిచట్టంబి' అనే పదానికి ఆ కాలంలో ఒక ప్రాంతాన్ని కాపాడే రక్షకుడు అనే అర్థం ఉంది. అదే భావంతో ఈ కథను నిర్మించినట్లు తెలుస్తోంది. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

టీజర్ విడుదలతోనే సినిమాపై అంచనాలు పెరిగాయి. యాక్షన్, ఎమోషన్, చారిత్రక నేపథ్యంతో కూడిన ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

# సముద్రపు సాహసం షురూ.. 'మోవానా' తెలుగు ట్రైలర్ వచ్చేసింది!




ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన యానిమేషన్ చిత్రం మోవానా ఇప్పుడు సరికొత్త రూపంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 2016లో విడుదలై సూపర్ హిట్ సాధించిన ఈ చిత్రం ఇప్పుడు లైవ్ యాక్షన్‌గా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా జూలై 10న గ్రాండ్‌గా విడుదల కానుండగా, తాజాగా తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది.

ఈ లైవ్ యాక్షన్ వెర్షన్‌లో, ఒరిజినల్ చిత్రంలో మౌయి పాత్రకు గొంతు అందించిన డ్వేన్ జాన్సన్ ఇప్పుడు అదే పాత్రలో వెండితెరపై కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో ఆయన మేకోవర్, పొడవైన జుట్టు, ఒంటినిండా టాటూలతో ఉన్న లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది.

ఈ చిత్రంలో మోవానా పాత్రలో యువ నటి కాథరిన్ లగాయ నటిస్తోంది. ట్రైలర్‌లో ఆమె నటనతో పాటు సముద్రపు అలల మధ్య సాగే అద్భుతమైన విజువల్స్, గ్రాఫిక్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. భారీ స్థాయి నిర్మాణ విలువలు ఈ సినిమాను మరింత ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.

ఈ చిత్రానికి థామస్ కైల్ దర్శకత్వం వహిస్తుండగా, సంగీతాన్ని లిన్ మాన్యుయెల్ మిరాండా అందిస్తున్నారు. ఒక చిన్న దీవిని, తన ప్రజలను రక్షించేందుకు ధైర్యవంతురాలైన యువతి మౌయి సహాయంతో చేసే సాహస యాత్రే ఈ చిత్ర కథాంశం.

ట్రైలర్ విడుదలతోనే 'మోవానా'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. విజువల్స్, యాక్షన్, భావోద్వేగాలతో కూడిన ఈ సాహస గాథ మళ్లీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది.




# దీపికా మెడపై వెరైటీ టాటూ..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకొణెకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న ఈ భామ, ఇటీవల తన మెడపై ఉన్న టాటూతో మళ్లీ వార్తల్లో నిలిచింది.

హీరో రణవీర్ సింగ్ను వివాహం చేసుకున్న దీపికా, పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో రాణిస్తూ అభిమానులను ఆకట్టుకుంది. పాన్ ఇండియా ప్రాజెక్టులు, హాలీవుడ్ సినిమాలతో తన రేంజ్‌ను మరింత పెంచుకుంది.

అయితే ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోలలో ఆమె మెడపై కనిపించిన '82*E' అనే టాటూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ టాటూ అర్థం ఏమిటా అని నెటిజన్లు ఆరా తీస్తున్నారు.

వాస్తవానికి '82*E' అనేది దీపికా స్థాపించిన స్కిన్ కేర్ బ్రాండ్ పేరు. ఈ బ్రాండ్‌ను ఆమె 2022లో ప్రారంభించి, చర్మ సంరక్షణ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. తన సొంత బ్రాండ్‌ను ప్రమోట్ చేసే విధంగా మెడపై టాటూ వేయించుకోవడం విశేషంగా మారింది.

ఇప్పటికే పలు రంగాల్లో తన ప్రతిభను చాటుకున్న దీపికా, వ్యాపార రంగంలోనూ సక్సెస్ అవుతూ ముందుకు సాగుతోంది. తన బ్రాండ్‌ను ఇలా ప్రత్యేకంగా ప్రదర్శించడం అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది.



# ఆ సినిమా చేసినందుకు నన్ను ట్రోల్ చేశారు..

టాలీవుడ్ అగ్రకథానాయిక కీర్తి సురేష్ తన కెరీర్‌లో ఎదుర్కొన్న ట్రోల్స్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తొలి చిత్రం నేను శైలజతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, తరువాత మహానటి సినిమాతో మరింత గుర్తింపు పొందింది.

అలనాటి మహానటి సావిత్రి జీవితకథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో సావిత్రి పాత్రలో కీర్తి సురేష్ అద్భుత నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అయితే ఈ సినిమా అంగీకరించినందుకు తాను ట్రోలింగ్‌కు గురయ్యానని ఆమె వెల్లడించింది.

ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, "మహానటి సినిమాలో నటించేందుకు మొదట నేను ఒప్పుకోలేదు. సావిత్రి పాత్ర అంటే చాలా భయమేసింది. కానీ దర్శకుడు నాగ్ అశ్విన్ నాకు ధైర్యం చెప్పారు. ఆయన నమ్మకం నాకూ నమ్మకం కలిగించింది. ఆ తర్వాతే ఈ ప్రాజెక్ట్‌కు ఒప్పుకున్నాను" అని తెలిపారు.

"ఈ పాత్ర చేస్తున్నానని కొందరు నన్ను ట్రోల్ చేశారని నాకు సినిమా పూర్తయ్యాకే తెలిసింది. ప్రమోషన్స్ సమయంలో ఆ విషయం తెలిసింది. కానీ విమర్శలు వచ్చినా, సావిత్రమ్మ పాత్ర పోషించినందుకు నాకు చాలా గర్వంగా ఉంది" అని కీర్తి సురేష్ చెప్పారు. అదేవిధంగా సోషల్ మీడియాలో వచ్చే నెగెటివిటీపై తాను ఎక్కువగా దృష్టి పెట్టనని, అందుకే ట్రోల్స్ ప్రభావం తనపై పడదని తెలిపారు. సావిత్రి జీవితాన్ని అర్థం చేసుకోవడానికి ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎన్నో విషయాలు తెలుసుకున్నానని, ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ ఆ పాత్ర చేయడం తన కెరీర్‌లో అత్యంత గర్వకారణమని పేర్కొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in